పత్రికా ప్రకటన
తేదీ: మే 26, 2025

కోఆర్డినేషన్ కమిటీ ఫర్ పీస్
(శాంతి సమన్వయ కమిటీ)

**మృతదేహంతో గౌరవప్రదంగా వ్యవహరించాలనే హక్కు ఉల్లంఘన:**
**హత్యకు గురైన మావోయిస్టుల మృతదేహాలను వెంటనే అప్పచెప్పాలి!**

ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మాడ్ ప్రాంతంలో 2025 మే 21నాడు జరిపిన చర్య తర్వాత మరణించిన వారిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందినవారి మృతదేహాలను వారి బంధువులకు అప్పచెప్పకపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాం.

పోస్ట్‌మార్టం పూర్తి చేసి మృతదేహాలను కుటుంబాలకు అప్పగిస్తామని ఛత్తీస్‌గఢ్ అడ్వకేట్ జనరల్ 2025 మే 24న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ముందు హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటికీ మృతదేహాలను ఇవ్వలేదు. ఈ సుదీర్ఘ జాప్యం తమ ప్రియమైనవారి మృతదేహాలను తీసుకెళ్లడానికి చాలా దూరం ప్రయాణించి వెళ్ళి, దుఃఖంలో ఉన్న కుటుంబాలకు మరింత తీవ్ర వేదనను కలిగిస్తోంది.

మృతదేహాలను గౌరవంగా భద్రపరచాలనే స్పష్టమైన చట్టపరమైన, నైతిక బాధ్యత ఉన్నప్పటికీ వాటిని కోల్డ్ స్టోరేజ్‌లో భద్రపరచలేదని, కుళ్ళిపోయేలా వదిలేశారనే ఆరోపణలు మరింత ఆందోళనను కలిగిస్తున్నాయి. ఇలా వ్యవహరించడం అనేది వైద్యపరమైన, చట్టపరమైన ప్రోటోకాల్‌లను తీవ్రంగా ఉల్లంఘించడం, మరణించిన వ్యక్తితో అమానవీయంగా వ్యవహరించడం, విషాదంలో ఉన్న కుటుంబాలకు మరింత మానసిక ఆందోళనను కలిగించడం అవుతుంది.

కోర్టు విచారణల సమయంలో భారత యూనియన్ తరపున హాజరైన డిప్యూటీ సొలిసిటర్ జనరల్, అంత్యక్రియల ఊరేగింపుల వల్ల "శాంతిభద్రతల" సమస్య వస్తుందని పేర్కొంటూ ఇద్దరి మృతదేహాలను అప్పగించడాన్ని వ్యతిరేకించడం మాకు చాలా బాధ కలిగించింది. సంతాపాన్ని నేరంగా పరిగణించే ఈ సమర్థన దుర్మార్గమైనది. రాజ్యాంగ వ్యతిరేకమైనది. శాంతియుతంగా అంతిమ సంస్కారాలు చేయడానికి తాము ఎలాంటి షరతులకైనా కట్టుబడి ఉండటానికి సిద్ధంగా ఉన్నామని కుటుంబాలు సీనియర్

న్యాయవాది ద్వారా కోర్టుకు ఇప్పటికే హామీ ఇచ్చాయి. అయినప్పటికీ మృతదేహాలను ఇవ్వలేదు. ఇది మానవ హక్కుల ఉల్లంఘన మాత్రమే కాదు, మనుషుల దు:ఖాన్ని అడ్డుకోవడం కూడా.

ఈ మానవీయ ప్రక్రియలో సహాయం చేస్తున్న కుటుంబ సభ్యులు, అంబులెన్స్ డ్రైవర్లు తదితరులు అధికారుల బెదిరింపులను, అడ్డంకులను ఎదుర్కొంటున్నారనే సమాచారం మమ్మల్ని ఆందోళనకు గురి చేస్తోంది. ఇది రాజ్యం తన అధికారాన్ని అనాలోచితంగా దుర్వినియోగం చేయడమే. ఇది దుఃఖంలో ఉన్నవారి బాధను మరింత తీవ్రతరం చేస్తుంది.

ఈ జాప్యం, ఉల్లంఘనలు కేవలం పరిపాలనాయంత్రాంగ లోపం మాత్రమే కాదు - ఇది రాజ్యాంగపరమైన, చట్టపరమైన బాధ్యతలను ఉల్లంఘించడమే అవుతుంది. జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు హామీ ఇచ్చే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో మరణంలో సైతం గౌరవం పొందే హక్కును చేర్చడాన్ని న్యాయపరంగా వివరించింది. పండిట్ పరమానంద్ కటారా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో - - మనిషి గౌరవం మరణంతో ముగియదని గౌరవనీయ సుప్రీంకోర్టు నిస్సందేహంగా పేర్కొంది. అనేక తరువాతి తీర్పులలో కూడా పునరుద్ఘాటించారు.

"అందువల్ల, ఆర్టికల్ 21 లోని 'వ్యక్తి' అనే పదమూ వ్యక్తీకరణా, చనిపోయిన వ్యక్తిని ఒక పరిమిత అర్థంలో కలిగి ఉంటుందని; మనిషిగా గౌరవంతో జీవించే హక్కును కలిగి ఉన్న అతని జీవితానికి, అతని హక్కులకు విస్తృత అర్థాన్ని కలిగి ఉందని మేము భావిస్తున్నాము; అతను జీవించి ఉంటే తన సంప్రదాయాన్ని, సంస్కృతిని, విశ్వసించిన మతాన్ని ఆచరించేవాడు. రాజ్యం ఆ మరణించిన వ్యక్తి మృతదేహాన్ని గౌరవంగా చూసుకోవడానికి అనుమతించడం ద్వారా ...., మృతదేహాన్ని సంరక్షించడం, మానవ గౌరవానికి అనుగుణంగా అంతిమ సంస్కారం చేయడం ద్వారా ఆ చనిపోయిన వ్యక్తిని గౌరవించాలి."

అంతర్జాతీయ మానవ హక్కుల చట్టం, మానవ హక్కుల చట్టం భారతీయ రాజ్యానికి కట్టుబడి ఉండే బాధ్యతలను నిర్దేశిస్తాయి. చనిపోయినవారిని వారి మతపరమైన ఆచారాల ప్రకారం గౌరవప్రదంగా ఖననం చేయాలని, వారి సమాధులను గౌరవించాలని నాల్గవ జెనీవా కన్వెన్షన్ ఆర్టికల్ 130 ఆదేశిస్తుంది. రాజకీయ హోదాతో సంబంధం లేకుండా హత్యకు గురైనవారిని దుర్వ్యవహారం బారిన పడకుండా అన్ని పక్షాలూ రక్షించాలి అని జెనెవా కన్వెన్షన్ I (1949) లోని ఆర్టికల్ 16 ఆదేశిస్తుంది. ఘర్షణ లేదా విపత్తు సందర్భాల్లో కూడా మరణించినవారి కుటుంబాలతో గౌరవప్రదమైన వ్యవహారం, సరైన పద్ధతిలో అంతిమ సంస్కారం చేయడం, గౌరవాన్ని పరిరక్షించే బాధ్యతను 2005 ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్ తీర్మానం మరింతగా నొక్కి చెబుతుంది.

దేశీయంగా, జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్హెచ్ఆర్సి), 2020 లో మరణించినవారిపట్ల చూపించాల్సిన గౌరవానికి సంబంధించిన తన సలహాలో, మరణించినవారి మృతదేహాలతో

మానవతాపూర్వకంగా వ్యవహరించడానికి సంబంధించి 11 స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది; ఇందులో సమయానికి దహనం లేదా ఖననం చేయడం, సరైన సంరక్షణ, గౌరవప్రదమైన రవాణా మొదలైనవి ఉన్నాయి. ఈ ప్రమాణాలను పాటించడంలో నేటి రాజ్య అధికారుల నిరంతర వైఫల్యం అటువంటి ప్రతి నియమాన్నీ ఉల్లంఘిస్తుంది.

మా డిమాండ్లు:

• ఇక ఏ మాత్రమూ ఆలస్యం చేయకుండా మృతదేహాలన్నింటినీ వారి కుటుంబాలకు వెంటనే అంద చేయాలి.

• కుటుంబ సభ్యులు, అంబులెన్స్ డ్రైవర్లు, సహాయంగా వచ్చినవారిపై అన్ని రకాల వేధింపులను నిలిపివేయాలి.

• మృతుల గౌరవానికి సంబంధించిన రాజ్యాంగ, న్యాయపర, అంతర్జాతీయ బాధ్యతలను పూర్తిగా అమలు చేయాలి.

• దేశీయ, అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా, తిరుగుబాటు నిరోధక కార్యకలాపాలలో మరణించిన వారి మృతదేహాలతో వ్యవహరించడానికి చట్టపరమైన ప్రోటోకాల్‌లను పాటించాలి.

మరణించిన మనుషులు ప్రతి ఒక్కరూ మరణంలో కూడా గౌరవానికి అర్హులు. ఈ మృతదేహాలను నిరంతరం నిర్బంధించడం చట్టపరంగా ప్రశ్నించదగినవి మాత్రమే కాదు, నైతికంగా కూడా ఖండించదగినది.

హైకోర్టు ముందు తాము ఇచ్చిన హామీని గౌరవించి, మృతదేహాలను మరింతగా కుళ్లిపోవడానికి ముందే వారి కుటుంబాలకు వెంటనే అందచేయాలని, కుటుంబాలవారు తమ ఆత్మీయులకు గౌరవంగా వీడ్కోలు పలికేందుకు వీలు కల్పించాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము.

కోఆర్డినేషన్ కమిటీ ఫర్ పీస్ తరఫున

ప్రొ.హరగోపాల్,

ప్రొ.జి.లక్ష్మణ్,

డా. ఎం.ఎఫ్. గోపీనాథ్ (79935 84903),

కవితా శ్రీవాత్సవ (93515 62965)

క్రాంతిచైతన్య (99122 20044)

మీనా కందసామి